
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 5 । మార్చి । 2023



60.265 టీఎంసీల నిల్వ

సోమశిల: జలాశయంలో శనివారానికి 60.265 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్‌డెల్టాకు 2,100, ఉత్తరకాలువకు 620, దక్షిణ కాలువకు 400, కండలేరుకు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,890
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,172
3 శాతం జీఎస్టీతో	రూ.5,326
సవర (8 గ్రా)	రూ.42,608

గరిష్ఠం/కనిష్ఠం
33.8 /22.2

వాతావరణం

జిల్లాలో ఆదివారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. రాత్రి పూట చలితీవ్రత ఎక్కువగా వాతావరణంలో తేమ 56 శాతం ఉంది.

న్యూస్‌రీల్

98.24 శాతం మందికి పింఛన్ల పంపిణీ



నెల్లూరు కళ్యాణినగర్‌లో కొండమ్మకు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ జయచంద్ర, వలంటీర్ సుకన్య

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. శనివారం నాల్గో రోజు 98.24 శాతం మంది లబ్ధిదారులకు నగదును వలంటీర్లు పంపిణీ చేశారు. 3,08,953 మందికి నగదు అందజేయాల్సి ఉండగా 3,03,514 మందికి పంపిణీ చేశారు. ఆదివారంతో పింఛన్ల పంపిణీ పూర్తి కానుంది.

స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు



స్కానింగ్ సెంటర్లలో రికార్డులు పరిశీలిస్తున్న డెమో అధికారి శ్రీనివాసులు

నెల్లూరు(అర్బన్): వైద్య ఆరోగ్యశాఖ డెమో అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పలు ఆస్పత్రుల్లోని స్కానింగ్ సెంటర్లను శనివారం తనిఖీ చేశారు. నగరంలోని తేజస్, విజయాకేర్, ఇందిరాస్కాన్, శ్రీనివాస స్కాన్, ఇమేజ్ స్కాన్ తదితర సెంటర్లలోని రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా డెమో అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ చట్ట ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమన్నారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు చట్టాన్ని దుర్వినియోగం చేసి లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్టు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఈ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సన్నద్ధంగా ఉండాలి

• కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సెక్టోరల్ అధికారులు ఆదివారం తనిఖీ చేసి 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శనివారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయం నుంచి ఎన్నికల అధికారులు, జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాల్లో వెలుతురు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. 6న సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. పోలింగ్ సిబ్బందికి కావాల్సిన



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

భోజనం, రవాణా, ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్స్‌లు తదితరాలకు సంబంధించి ఏర్పాట్లలో లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు.

వేసవి జాగ్రత్తలు తప్పనిసరి

వేసవి కాలం ప్రారంభంలోనే ఎండలు ఎక్కువగా ఉన్నాయని అందువల్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ చక్రధర్‌బాబు ఆదేశించారు. మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ అందుబాటులో ఉంచుకుని వినియోగించుకోవాలన్నారు. ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో కూలీల నీడ కోసం పట్టలు, మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ నెల 22 నాటికి ఉగాది రోజున గృహప్రవేశాలు జరిగేలా లక్ష్యాలకు అనుగుణంగా జగనన్న ఇళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకోసం మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ రోణంకి కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఎన్నికల అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

జీవనోపాధికి 35 శాతం సబ్సిడీతో రుణాలు

• డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

నెల్లూరు (అర్బన్): జిల్లాలోని పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలకు మరింత ఆర్థిక భరోసాగా పీఎంఎఫ్‌ఎంఈ (ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమ క్రమబద్ధీకరణ) పథకం ద్వారా జీవనోపాధి కల్పిస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో సాంబశివారెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చిప్స్, పాప్‌కార్న్ తయారీ మెషిన్, ఇడ్లీ పిండి తయారు చేసే గ్రైండర్లు, జ్యూస్ తయారీ మెషిన్ తదితర ఆహార ఉత్పత్తులకు సంబంధించిన యంత్రాలతో జీవనోపాధి కల్పిస్తామన్నారు. ఈ మెషిన్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి ఉన్న పొదుపు మహిళలకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు డీఆర్‌డీఏ ద్వారా అందేలా చూస్తామన్నారు. ఇందులో 35 శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. మిగతా మొత్తాన్ని మాత్రమే బ్యాంక్‌లకు తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 31



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

నాటికి 1000 మందికి యాంత్రీకరణతో కూడిన జీవనోపాధులు కల్పిస్తామని తెలిపారు. యాంత్రీకరణ ద్వారా ఉపయోగపడే పథకాలపై మరో వారం తర్వాత జిల్లా స్థాయిలో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఎగ్జిబిషన్ ద్వారా యాంత్రీకరణతో కూడిన ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తక్కువ వడ్డీకి రుణాలిచ్చే బ్యాంక్‌లతో లావాదేవీలు

జిల్లాలో తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చే బ్యాంక్‌ల ద్వారానే పొదుపు సంఘాల లావాదేవీలు నిర్వహిస్తామని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు. ఇప్పుడు బ్యాంక్‌లు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పొదుపు సంఘాలకు రుణాలు ఇస్తున్నాయన్నారు. ఇందులో కూడా తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామంటూ జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ముందుకు వచ్చిందన్నారు. పొదుపు సంఘాల పొదుపు నగదును అవసరమైనప్పుడు విత్‌డ్రా చేసుకునేందుకు నియంత్రణ లేకుండా కూడా కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు అంగీకరించిందన్నారు. ఈ బ్యాంకులో రుణాలు తీసుకుంటే బ్యాంకు వద్దకు వెళ్లి చెల్లించే అవసరం కూడా ఉండదన్నారు. గ్రామాల్లో ఉండే సహకార సొసైటీల ద్వారా రుణాలు తిరిగి చెల్లించవచ్చన్నారు. ఇందువల్ల పొదుపు మహిళలు పట్టణాల్లో బ్యాంకుల వద్దకు పనులు మానుకుని వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. పలు ప్రైవేట్ బ్యాంకులు పొదుపు సంఘాలకు రుణాలు ఇస్తామని ముందుకు వస్తున్నాయని అయితే తక్కువ వడ్డీకి ఇచ్చే వారి బ్యాంకుల్లో మాత్రమే పొదుపు సభ్యుల ఖాతాలను ప్రారంభిస్తామన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

నెల్లూరు(క్రైమ్): ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్పీ సీహెచ్ విజయారావు చర్యలు చేపట్టారు. మద్యం, నగదు ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. అక్రమ మద్యంపై 32 కేసులు నమోదు చేసి రూ.1,86,465 విలువ చేసే 141.73 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాటుసారాపై మూడు కేసులు నమోదు చేసి 14 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలతో పాటు ప్రధాన కూడళ్లల్లో 24గంటలూ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రశాంత ఎన్నికలకు గాను జిల్లాలో 107 సీఆర్‌పీసీ, 110 (ఈ) సీఆర్‌పీసీ కింద రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లోని నిందితుల బైండోవర్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 167 కేసులు నమోదు చేసి 735 మందిని బైండోవర్ చేశారు. 473 లైసెన్స్‌డ్ ఆయుధాలను డిపాజిట్ చేసుకున్నారు. 175 నాన్‌బెయిలబుల్ వారెంట్లను ఎగ్జిక్యూట్ చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై రెండు కేసులు నమోదు చేశారు.

95 సమస్యాత్మక కేంద్రాలు

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 169 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 95 సమస్యాత్మక, 74 సాధారణ కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ విజయారావు

పటిష్టభద్రతా ఏర్పాట్లు చేయాలి

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ నిర్భయంగా వినియోగించుకునేలా యంత్రాంగం సన్నద్ధం కావాలని ఎస్పీ సీహెచ్ విజయారావు ఆదేశించారు. ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో శనివారం ఆయన పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సాధారణ, సున్నిత పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లు, ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలు, పోలింగ్ రోజున బందోబస్తు ఏర్పాట్లు తదితర అంశాలపై క్షుణ్ణంగా చర్చించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ ఎలాంటి అల్లర్లు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అసాంఘిక శక్తులు, రౌడీషీటర్లు, గత ఎన్నికల కేసుల్లోని నిందితులను బైండోవర్ చేయాలన్నారు. ఆయుధాలను డిపాజిట్ చేయాలన్నారు. ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని, ఉల్లంఘనులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గత అనుభావాలను దృష్టిలో ఉంచుకుని సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయేంత వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, శ్రీనివాసరావు, ప్రసాద్, డీఎస్పీలు డి. శ్రీనివాస రెడ్డి, పి.వీరాంజనేయరెడ్డి, ఎస్. కోటారెడ్డి, రమణ, అబ్దుల్ సుభాన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌లు మధుబాబు, షఫి, డీటీసీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థపై కఠిన చర్యలు

• ధాన్యాన్ని ఎవరికైనా అమ్ముకోవచ్చు
• జేసీ కూర్మనాథ్



నెల్లూరు (అర్బన్): జిల్లాలో వరికోతల ప్రక్రియ వేగవంతమైన నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లలో దళారులు ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ కూర్మనాథ్ హెచ్చరించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 20 శాతం వరికోతలు జరిగాయన్నారు. కందుకూరు డివిజన్‌లో 30 శాతం వరికోతలు పూర్తయ్యాయన్నారు. మద్దతు ధరకన్నా బయట మార్కెట్‌లో రేటు అధికంగా ఉందన్నారు. దీంతో రైతులు బహిరంగ మార్కెట్లో అమ్ముకుంటున్నారని తెలిపారు. ఒక వేళ రైతులు కొనుగోలు కేంద్రాలకు వస్తే తామే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. రైతులు నేరుగా మిల్లుకు వెళ్లేందుకు వీలు లేదన్నారు. మిల్లర్లు కూడా రైతుల వద్ద నుంచి నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేయొద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నుంచే ధాన్యాన్ని తామే మిల్లులకు పంపిస్తామన్నారు. మిల్లర్లకు, రైతులకు మధ్యలో దళారులు వస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులు కూడా దళారుల మాటలు నమ్మొద్దని తెలిపారు. ఇతర జిల్లాల మిల్లర్లు, ట్రేడర్స్‌కు రైతులు స్వేచ్ఛగా, నిర్భయంగా ధాన్యాన్ని అమ్ముకోవచ్చన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారస్తులనే జిల్లా మిల్లర్లు సిండికేట్ అయి అడ్డుకున్నా, ధర తగ్గించినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు రైతులను చైతన్య పరచాలని జిల్లా వ్యవసాయశాఖాధికారులను ఆదేశించామన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 145 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): శనివారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 145 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జనరల్‌కు సంబంధించి 3,390 మందికి 3,343 మంది హాజరైతే 47 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 273 మందికి 247 మంది హాజరు కాగా 26 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జనరల్‌కు సంబంధించి 2,729 మందికి 2,684 మంది హాజరయ్యారు. 45 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 303 మందికి 276 మంది హాజరు కాగా 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

పెద్దాస్పత్రిలో అరుదైన ఆపరేషన్

- మహిళ జీర్ణాశయంలో మూడు కేజీల కణిత తొలగింపు

నెల్లూరు (అర్బన్) : దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో (జీజీహెచ్)లో ఓ మహిళకు అరుదైన ఆపరేషన్ చేసి జీర్ణాశయంలో ఉన్న మూడు కిలోల కణితను తొలగించారు. వివరాలిలా ఉన్నాయి.. మనుబోలు ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల అపర్ణకు తీవ్రమైన కడుపునొప్పి వచ్చేది. వైద్యం కోసం గూడూరు, నెల్లూరులోని పలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లారు. పెద్దపేగులో పెద్దగడ్డ ఉందని, కేన్సర్ గడ్డ అయి ఉండొచ్చని డాక్టర్లు తెలిపారు. కొందరు గడ్డను తొలగించేందుకు ముందుకు రాకపోగా, మరికొన్ని ఆస్పత్రుల్లో ముందుకొచ్చినా రూ.లక్షల్లో ఖర్చవుతుందని చెప్పారు. దీంతో పేషెంట్‌కు తెలిసిన వారి ద్వారా వైద్యం కోసం ఆమె నెల్లూరు పెద్దాస్పత్రికి మంగళవారం వచ్చింది. ఐదో యూనిట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రోజారమణి ఆధ్వర్యంలో ఆమెకు బుధవారం ఎంఆర్ఐ చేశారు. మెసెంట్రిక్ ట్యూమర్ (గడ్డ) ఉందని నిర్ధారించారు. అది కూడా అండాశయం (ఓవరి), పేగుకు అతుక్కుని ఉంది. దీంతో ఆపరేషన్ సంక్లిష్టమవుతుందని, అయినప్పటికీ డాక్టర్ రోజారమణి ఆధ్వర్యంలో డాక్టర్లు చిరుమల, రమణయ్య, ఎస్ఆర్ డాక్టర్ శివకృష్ణ తదితరుల బృందం ముందుగా రోగికి ధైర్యం చెప్పారు. అదేరోజు ఆపరేషన్‌ను దిగ్విజయంగా చేశారు. గడ్డను పరీక్షలకు పంపారు. ప్రస్తుతం పెద్దాస్పత్రిలోని ఐసీయూలో రోగి కోలుకుంటోంది.


మహిళకు ఆపరేషన్ చేస్తున్న వైద్యులు


తొలగించిన కణిత

సర్జరీ సేవలను ఉపయోగించుకోండి

పెద్దాస్పత్రిలో నైపుణ్యం ఉన్న సీనియర్ సర్జన్లు ఉన్నారు. తాము విధుల్లో చేరాక సర్జరీల సంఖ్య పెరిగింది. దీంతో పాటు థైరాయిడ్, హెర్నియా, పిస్టులా, ఫిజర్, రొమ్ముగడ్డ తదితర పలు రకాల సర్జరీలు చేస్తున్నాం. రూపాయి ఖర్చు లేకుండా ప్రజలు ఆస్పత్రిలోని వైద్య సేవలను వినియోగించుకోవాలి.



– డాక్టర్ రోజారమణి, అసోసియేట్ ప్రొఫెసర్ జీజీహెచ్

టీకాలపై స్పెషల్ డ్రైవ్

- నూరుశాతం లక్ష్యాలు సాధించాలి

నెల్లూరు (అర్బన్) : వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ నివాస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వ్యాధి నిరోధక టీకాల అమలుపై ఆ శాఖ శనివారం నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 81 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో టీకాల అమలు తీరును తనిఖీ చేశారు. ఇందుకోసం 13 మంది ప్రోగ్రామ్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. అందులో భాగంగా డీఎంహెచ్‌ఓ పెంచలయ్య గిద్దలూరు, సైదాపురం తదితర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. మిగిలిన వారు పలు ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు షెడ్యూల్ ప్రకారం నూరుశాతం టీకాలు వేయాలన్నారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

పోస్టల్ బ్యాలెట్ల వినియోగంపై శిక్షణ

నెల్లూరు (అర్బన్) : తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో శనివారం అధికారులకు శిక్షణ జరిగింది. పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి అయిన ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎన్నికల్లో పాల్గొనే ఉద్యోగులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్):	రూ.104
లేయర్ (లైవ్):	రూ.75
బ్రాయిలర్ చికెన్:	రూ.186
స్కిన్‌లెస్ చికెన్:	రూ.206
లేయర్ చికెన్:	రూ.128

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	:రూ.80
సన్నవి	:రూ.74
పండు	:రూ.40

